కథానిక

# ఆశాభంగం

ఊటుకూరి రంగారావు

ఉదయం మంచి ఘాటైన గరంగరం టీని ఇడ్లీ అనే ఘనపదార్థంతో సహా కడుపులోకి పంపించాను, ఒళ్ళూ మనస్సూ అంతా బలే ఉత్సాహంగా వుండి ఏం చేయాలా అనిపించింది. ఏమీ పని తోచనప్పుడల్లా ఆలోచించడం, రాయడమే నాకు పని. ఊహలమీద ఊహలు, ఆలోచనలు దండలు దండలుగా, తెరలు తెరలుగా వస్తూంటే మనస్సు మత్తెక్కిపోతోంటే, అనిర్వచనీయమైన ఆనందం అనుభవిస్తూ, ఎక్కడికో తేలిపోవడం అందరికీ సాధ్యంకాదు.

అన్నయ్యకి నిన్న అమాంతం పెరాలిసిస్ వచ్చేసిందనీ, దాంతోపాటు స్మృతిలేకుండా పడిపోయాడనీ, డాక్టర్లు పెదవి విరిచారనీ వున్నపళంగా బయలుదేరి రమ్మనీ వరంగల్ నుంచి "సుజాత" యిచ్చిన టెలిగ్రాం అది...

వెంకోబారావుని నే చూడక దాదాపు ఏడెనిమిదినెలలు కావస్తోంది. ఇంతలోనే వాడికిలా ప్రమాదంగా జబ్బు ముంచుకొచ్చిందని తెలియడంతోనే నాకెందుకో ఓసారి కళ్లు చెమ్మగిల్లాయి. తల్లీ దండ్రీ నశించి, స్వయంశక్తిమీద వుద్యోగం సంపాదించుకుని ఎక్కడో జీవితం సాఫీగా వెళ్ళదీస్తూ చెల్లెలికి చదువు చెప్పించుకుంటూ తృప్తిపడేవాడిమీద యీ పిట్టపిడుగేమిటి? పాపం. సుజాత ఎలావుందో, ఎంత బేజారవుతోందో... వాడికి నేనొక్కణ్ణే తప్ప చిన్నప్పటినించి తెలిసిన ఆప్తమిత్రుడింకెవడూ లేడు.

వెంకోబారావుకీ నాకూ చిన్నతనంనుంచీ స్నేహితం. వాళ్ళనాన్న సంపాదించిపోయిందేమీలేదు-దరిద్రం తప్ప. ఎలాగో పెరిగి పెద్దవాడై ఇవాళ ఉద్యోగం చేసుకుంటున్నాడు. అదివరకు వాళ్ళింటికి నేనూ మాయింటికి వాడు వస్తూ పోతూండేవాళ్ళం. వాడు అప్పుడప్పుడు చేసే చిలిపిచేష్టలకీ అబద్ధాల ప్రచారానికీ కోపం వచ్చి వాడికి నేను 'కోతి' అనే బిరుదిచ్చాను. పెద్దయింమీకా చాలామంది మిత్రులు వాణ్ణదే పేరుతో పిలిచి ఏడిపించుకు తినేవాళ్లు. సుజాత మాంచి అందమైన చలాకీపిల్ల...బహుశా ఇప్పుడు స్కూల్ ఫైనల్ చదువుతుంటుంది...దాన్ని చిన్నప్పుడు నానారకాలుగా ఆడించి కోపం తెప్పించేవాణ్ణి...సుజాతంటే నా కెందుకో మంచి అభిమానం వుందీనాటికీని.

వెంకోబారావుకి పట్టిన దురవస్థకి దురపిల్లిపోయానంటే నమ్మండి. ఏం చేయాలి అనే నిర్ణయంకోసం తటపటాయింపు వదిలి, ఇంకో అర్థగంటలూ బయల్దేరబోయే బండికి తయారయాను.

ఆఫీసుకి సెలవుచీటీ వ్రాసి ఓ కుర్రాడిచేత పంపించి తిన్నగా రైలుస్టేషనుకు చేరుకున్నాను. సమయానికి ఏవన్నా అవసరాలుంటాయని ఓ మిత్రుడిదగ్గర కొంతడబ్బు చేబదులు తీసుకుని మరీ బయలుదేరాను.

బస్తీలో వుండడం చిన్నప్పటినుంచీ మరిగి, ఉద్యోగం అవసరంలేకున్నా ఉద్యోగం సాకుతో ఇలా డబ్బుతగలేస్తూంటాననీ, నేను పూర్తిగా చెడిపోతున్నాననీ మా యింటిదగ్గరవాళ్ళ అభిప్రాయం. అలానని నాకు వాళ్ళు కావాలన్నప్పుడు డబ్బు పంపకుండా వుంటారా అంటే అదీ లేదు. పంపుతూనేవుంటారు. అంటూనేవుంటారు. నా వుద్యోగంతో నేను సంపాదించే డబ్బు; కచ్చితంగాచెప్పాలంటే నెల మొత్తంమీద హోటల్‌కీ, సిగరెట్లకీ హతం అవుతుంది. అయినా ఎలానో బతగ్గలుగుతూనే వున్నాను. నేను మిత్రులదగ్గర అప్పుగా పుచ్చుకున్న బాకీలు తీరిస్తే చాలుగాని దాదాపు ఇప్పటికొన్ని వేలసంఖ్యల్లో వుంటాయి. కాని వాళ్లు నన్నడగనూ అడగరు. నేను ఇచ్చిన పాపానపోను. అలా అప్పు పేరుతో తెచ్చుకోకుండా నాకు గడవనూగడవదు. ఇలా ఎంతకాలం గడుస్తుందని ప్రశ్నిస్తే అది వేరువిషయం...

'వీడికి త్వరగా పెళ్ళిచేసేస్తేకాని దోవకిరాడు' అంటుంది నేనింటికి వెళ్ళినప్పుడల్లా. మా అమ్మ

"అసలు వాడిప్పుడు పెళ్ళిచేసుకునేదశలో వున్నాడనీ, మనమాట వింటూ కూర్చుంటాడనీ ఇంకా నీ పిచ్చి అభిప్రాయం.. ..వాడెక్కడ.... వాడికి మాట్లాడ్డానికే తీరదు"అని వెటకారంగా మా అన్నాయ్ పంచకావ్యాలు చదివేస్తాడు మా అమ్మ ముందు. అమ్మకి నేను కనపడ్డంతసేపు నా పెళ్ళి గొడవే.

"పెళ్ళిచేసుకోవడానికి నీకేమభ్యంతరం?" అని అమ్మ నన్ను బలవంతంచేస్తే నేనేంచెప్పను? ఒకవేళ ఏదన్నా చెప్పినా వాళ్లు సంతృప్తిపడొద్దా? అంతేకాదు- నేను పెళ్ళిచేసుకోకపోవడం మా యింట్లోవాళ్ళకే కాక ఇరుగుపొరుగువాళ్ళకు కూడా ఇదో సమస్యగామారింది. పెళ్లైతే, అనుభవించే, కష్టాలూ, నష్టాలూ, ఆనందానురాగాలూ నావో వాళ్ళవో నాకర్థంకాదు. విసుగుపుడుతుంది. వీళ్ళమాటలు వినని నేను బస్తీలో ఏవో దురలవాట్లకి లోనయ్యాననీ, లేకుంటే పెళ్ళిచేసుకోకపోవడమేమిటనీ ఊహించుకుని సంతృప్తిపడతారు. నిజానిజాలు వాళ్ళకెందుకు? ఏదో తమ అనుమానాన్ని బలపరచే రెండుమూడు కారణాలు వెదికి పట్టుకుని అవి నిజమేనని తృప్తిపడటం తప్ప.

నేను పెళ్ళిచేసుకోకపోవడానికి సవాలక్ష కారణాలున్నాయి. అవన్నీ చెబితే ఎవళ్ళన్నా నమ్ముతారా? చెప్పి నేను వెక్కిరింతలపాలు గావలసిందే. ఇది నా యిష్టానికీ నా అభిరుచులకీ సంబంధించిన సమస్య. ఇందులో ఎవరికీ అధికారంలేదు.

నాకు మొదటినుంచీ సహజంగా అమ్మాయిలతో మాట్లాడ్డమన్నా, అమ్మాయిలన్నా అంతగా సదభిప్రాయంలేదు ఎందుకంటే, వాళ్లు వూళ్ళకి అనుకూలంగావున్నంతసేపూ చనువుగావుంటారు. యిష్టంలేని మరుక్షణంలో మగాళ్ళని బుద్ధిలేనివాళ్లుగా ప్రచారంచేస్తారు. కాకుంటే స్నోలూ, పౌడర్లూ మోయిస్తో గాడిదచాకిరీ చేయించుకుంటారు. వాళ్ళకి యిష్టంలేకపోవడమనే ఈ విషయం ఏ కొద్దికారణంమీదనైనా సృష్టి అవుతుంది.

అందరమ్మాయిలకంటే సుజాతలోమాత్రం నాకొకవిధమైన ప్రత్యేకత కనిపిస్తుంది. సుజాతని చూస్తుంటే అయిష్టంకలక్కపోగా మాట్లాడాలనిపిస్తుంది. మాట్లాడినంతసేపూ అదోరకం తీయగా ఏదో మధురలోకంలో విహరిస్తున్నట్టుంటుంది... ఇంతెందుకూ? సుజాతలో నన్ను ఆకర్షించే లక్షణం ఒక్కటికాదు బోలెడుకనిపిస్తాయినాకు. మా మూర్తి రిమార్కు ప్రకారం సుజాతముందు నాలో వైచ్యానుసంధానం ప్రజ్వరిల్లదు. ఆవిడలో అహంభావం అంకురించదు. ఇద్దరం ఒకళ్ళనొకళ్ళు అవగాహన చేసుకున్నందువల్లే ఇలావుంటుంది గాని ఏవో గుణాలు రామ్మూర్తి అన్నప్రకారం వుండడం అసంభవం. వాడెక్కడో నాలుగైదు ఇంగ్లీషువాక్యాలు రట్టుకొట్టి ఉపయోగించే పరిస్థితులు తెలీక అన్నదానికల్లా ఉపయోగిస్తుంటాడు తప్ప అర్థంలేదు. అయినా వాడి రిమార్కుల్ని నే నెప్పుడూ అంతగా ఖాతరు చేయను. వాడేదో అంటున్నాడని, ఒకవేళ నేను అమ్మాయిలకోసం పడిచచ్చేంత ప్రయత్నంచేసినా, మనకోసం బలికావడానికీ, కనీసం ప్రేమలేఖ రాయడానికైనా ఏ అమ్మాయివాళ తయారుగావుంది?

'సుజాత'ని నేను పెళ్ళిచేసుకుంటే బావుంటుందనీ, ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం బాగా ఎరిగినవాళ్ళమనీ వెంకోబారావు అప్పుడప్పుడు ధ్వనిస్తుండేవాడిదివరకు. ఈమాటలు ఊహించుకుంటే నాకోవిధమైన అభిప్రాయం కలిగేది. సుజాతని నేను పెళ్ళిచేసుకోవడమేంకర్మ... మాంచి అందగత్తె...చక్కగా చదువుకుంటూన్నది. నిజం చెప్పాలంటే, సుజాతకి నేను తగినవాణ్ణి ఎన్నడూ కాను. నాకంత అందంగానీ, అంత సౌకుమార్యం గానీ, అంతటి అమృతహృదయంగానీ లేదు.... నిజంగా నేను సుజాతను పెళ్ళిచేసుకోవడమన్నా సుజాత నన్ను చేసుగోవడానికి అభ్యంతరం చెప్పకున్నా అది నా అదృష్టమొక్క విపరీతపుపంటే ననాలి. కాని, హృదయం పూర్తిగా ఒప్పుకోదు. సుజాత సౌందర్యం ఎంతో రసహృదయంతో ఆరాధించదగింది కాని, నాలాంటి రాక్షసహస్తాలకి అంకితం కాదగిందికాదు. చక్కని లేతగులాబీని ఎండలో తెంపివేయడం ఎలాంటిదో సుజాతని నేను పెళ్ళాడ్డం అలాంటిది....

ఇంత ఆలోచనల భారంతో స్టేషనుకి ప్రవేశించాను. తీరా వాకబు చేస్తేనే వెళ్ళాలిసిన రైలు లేటుగా వచ్చేస్తుందని తెలిసింది. ఇంకా బుకింగ్ లేదు. తిన్నగా మామిత్రుడు ఎ.ఎస్.ఎం.

దగ్గర కెళ్ళాను ఎంత లేటో కనుక్కుందామని... నైట్ డ్యూటీ చేసి, ఈలవేస్తూ తీరిగ్గా కూచుని విశ్రాంతి ననుభవిస్తూన్న మిత్రుడు నన్ను చూసి చిరునవ్వు నవ్వి "ఎటోయ్ ప్రయాణం?" అన్నాడు.

"ఇటే, పడమరవైపు... ఈ రైలు యెంత లేటేమిటి? అవతల మా మిత్రుడొకడు డెత్ బెడ్ మీదున్నాడు త్వరగా వెళ్ళాలి" అన్నాను.

"ఫరవాలేదు. మిత్రుడి కర్మకాండల కందుకో గలవులే" అంటూ వ్యంగ్యంగా మాట్లాడి వెళ్ళి పోయాడు.

ఈ లేటుకావడంకూడా సరిగ్గానే తోచయ్యాయని ఉసురుమంటూ ఓ చోట కూలబడి ఆలోచిస్తున్నాను. ఆలోచించాలిగాని, ఆలోచన కంది నంతవరకు చూసినా బ్రతుకులన్నీ లేటే ననిపిస్తుంది. ఈమధ్య నెక్కడో "ఇజాల్లో నిజాలు" అని రాస్తూ ఎవరో మిత్రుడు "డిలేయిజం"ని కూడా చేర్కొన్నాడు. ఈ 'డిలేయిజం' నిజంగా మనిషిలోంచి దానంతటదే పుట్టుకొస్తూంటుందనీ, దీని కెవళ్ళో కాదు. ప్రకృతీ, మనుషుల మనస్సులే కారణమూ, బాధ్యత వహించాలనీ అనిపిస్తుంటుంది. కాకుంటే, వెంకోబారావు పెళ్ళీ, వాడి చెల్లెలి పెళ్ళీ, నా పెళ్ళీ, నాలాంటి యింకా కొంతమంది పెళ్ళీ, యింత లేటుగావడం దేన్ని గురించంటారు! మినిష్టర్ల పదవీ కాలాలే లేటయి సంవత్సరాలు సాగుతూంటే దిక్కు లేదు కాని, ఇక నా పెళ్ళీ, ఈ రైలూ లేటయితే మాత్రం విమర్శలు తప్పనిసరిగా దూకుతాయి. విచిత్రం!

జపం చేస్తూచేస్తూ విసిగిపోతున్న తరుణంలోనే వెళ్ళే రైలు రానేవచ్చింది. గంటున్నర లేటుని మూట గట్టుకుని... నాకేముంది... బెడ్డింగా... పెట్టా... బెగ్గర్ ఫెలోలా అమాంతం రైలులో దూరేశాను. ఎదురుచూసి చూసి అలసిపోయి నందుకో అనువైన సీటు దొరికింది కూడాను.

రైలు కిటికీలోంచి చూస్తుంటే, చెట్లు నడుస్తున్నాయా, రైలా పరిగెడుతోందా అన్న సంశయం కలిగింది. "చెట్లు నడిస్తే ఎంత భయంకరమో"నని ఎప్పుడో ఎక్కడో ఓసారి కవిరాజుగా రన్నట్టు గుర్తు. ఆ చరణాన్ని ఊహిస్తుంటే మాత్రం మా కవిరాజు ఎప్పుడో ఓ పర్యాయం రైలుబండిలో పోతూపోతూ ఈ గీతం చరణం వ్రాశాడని నా కనిపిస్తుంది.

దూర భూరేఖమీదగల చెట్లు, అమాంతం ప్రస్తుతంలోకి వచ్చి, క్షణకాలంలోనే రివ్వుమంటూ గతంలోకి అదృశ్యమైపోతాయి. ఈ సమయంలో నిజంగా మా 'సత్యానందస్వామి' నా పక్కన వున్నాడంటే దీనంతటినీ వేదాంతపరంగా మార్చిపారేసి ఉపన్యసిస్తాడు.

మానవ జీవితాలైనా ఇంతేననీ, ఏదో క్షణకాలం, బుద్బుదప్రాయమైన ఈ పృధివిమీద మెలవడానికి, ఎంతో దూరంనుంచి ఎన్నో శ్రమల కూర్చుకుని, గర్భ నరకాన్ని కూడా అనుభవించి మరీ బయటపడతాడనీ, మళ్ళీ గతంలో కలిసిపోతాననే విజ్ఞానం వీసమెత్తైనా లేక ఏదేదో చేసేస్తూంటాడనీ చెప్పిచెప్పి ఒక్కవేడి నిట్టూర్పు విడుస్తాడు. క్షణంలో ఆయన భంగిమ మారిపోతుంది. ఇంతా అనీఅనీ చిట్టచివరికి ఆయన నాకిచ్చే సూచనేమిటంటే "ఈ క్షణకాలం పాటైనా పెళ్ళిచేసుకుని ఆనందంగా బతుకుని సెటైలయ్యి నాయనా!" అని. సత్యానందస్వామి నాక్కలిసినప్పుడల్లా ఇలానే వేదాంతాన్ని బోధించి చివరికి ఆ ముక్క తగిలించి పోవడం ఆయన కలవాటు. నాకు చిర్రెత్తుకొస్తుంది. ఐనా పైకి కనపడనీయకుండా "స్వామీ మీరు సన్యాసాశ్రమం స్వీకరించారుగదా, మళ్ళీ నాకేమో ఈ సంసార నరకంలో పడమని బోధిస్తున్నారు" అని వినయంగా అడిగితే, "ఈ సన్యాసాశ్రమం మాబోటి ప్రజలకే బాబూ! అందరూ దీన్ని ఆచరించలేరు. గృహస్థాశ్రమంలో వుండి కూడా మోక్షాన్ని సంపాదించవచ్చని శ్రుతిస్మృతులు ఘోషిస్తున్నాయి. తప్పులేదు" అంటారు స్వామీజీ.

"సంసారంలో గలది మధుర దశో, నికృష్ట దశో అనుభవించని మీకు మాత్రం ఏం తెలుసు స్వామీ!" అంటే, "ఎదురు ప్రశ్నించడం, తాత్విక విషయాలు చర్చించడం తగవు. అన్నది నమ్మితీరాలి" అని చప్పున జారుకుంటారు మా సత్యానందస్వామిగారు.

ఇంతకీ, ఎక్కడో ఎర్రని కాషాయ వస్త్రాలు ధరించి, హాయిగా ముక్కు మూసుకోక కాయసక్తి

నా పెళ్ళి గొడవెందుకు చెప్పండీ! ప్రపంచంలో కొన్ని కోట్లమంది పెళ్ళి కానివాళ్లున్నారు. వాళ్ళందర్నీ వదిలి, నా ఒక్కడిమీదే వీళ్ళంతా విరుచుకపడతారేం కర్మో తెలియక చావొస్తోంది నాకు.

నా ఆలోచనలు ఒకదాన్ని గురించి ఆరంభమైతే ఇంకోదాంట్లోకి కప్పలా గంతులు వేస్తూ వేస్తూ చివరికి మాతృకనే మరిచిపోతాయి. ఒక్క పాయింటుమీద నిలబడి, దాన్ని గురించే ఆలోచించేంత చిత్త సంస్కారం లేకపోవడంతో, నాపని మరీ ఇబ్బంది పాలవుతోంది నే నాలోచిస్తూ వుండగానే మా బండి వరంగల్ ప్లాట్‌ఫారంమీద ఆగిపోయింది. నాగొలుసు విషయాలు తెగిపోయాయి. శరీరం సగం హూనమై, రెండు చోట్ల తల బొప్పికట్టిన తరువాత రైలునుంచి ప్లాట్‌ఫారంమీద అడుగు వేయగలిగాను. ఈ రోజుల్లో రైళ్ళు దిగడం, ఎక్కడం మొదలైన సర్కస్ ఫీట్సులాంటి కష్టాలకన్నా, పెళ్ళి చేసు చేసుకోవడమే సులభంగా కనిపిస్తుంది.

ప్లాట్‌ఫారందాటినదగ్గర్నుంచీ మళ్ళీ వెంకోబారావు స్థితినిగురించిన అదుర్దా చీకటి తుఫానులా నన్ను ముంచెత్తింది. వాడింటికి ఒక్కో అడుగు దగ్గరపడుతున్నకొద్దీ భయంభయంగా, కడుపులో దేవినట్టుంది. ఏ కబురు వినాల్సి వస్తుందో, స్టాలిన్‌లా అమాంతం వాడి బ్రెయిన్ బద్దలైందో, పొద్దుటినుంచీ ఏం పరిస్థితులు జరిగాయో చిట్టచివరికి వాడీ సంకీర్ణ మానవారణ్యంలో దిక్కులేనివాడిగా వెళిపోయాడేమోనని గుండె బేజారై కాళ్లు తడబడుతుంటే, తిన్నగా వాడింటి ముందు కొచ్చేశాను. గుండెలు గంటకు నూరువందలసార్లు కొట్టుకున్నంత అలజడీ, కంపంతో ఆగిపోయాను. వాకిటితలుపు లోపల గడియవేసి వుంది. లోపల నుంచి ఎలాంటి ధ్వనీ వినపడ్డంలేదు. ఉండబట్టలేక రెండు మూడుసార్లు తలుపును చప్పుడుచేశాను. ఎవరో తలుపు తీస్తున్నట్టు ధ్వని విని మనస్సుని అదిమి పట్టుకున్నాను. పచ్చగా విరబూసిన తంగేడుచెట్టులా సుజాత నా కళ్ళముందు ప్రత్యక్షమైంది. ఆవిడ ముఖంలో దుఃఖంగానీ, కనీసం ఆ సూచనలుగానీ లేవుకదా, అప్సరసలా తయారై నిలబడింది.

"అప్పుడే రానే వచ్చేశావే, సుస్వాగతం. అన్నాయ్ చెప్పే వెళ్ళాడు నీవొస్తావని. రా. అలా నిలబడ్డావేం?" అంది సుజాత.

నేనెలావున్నానో నాకే తెలీక ఓసారి బుర్ర గోక్కుని, "అయితే వాడికెలావుందిప్పుడు?" అన్నాను. "ఎవరికి?" సుజాత ప్రశ్న నన్ను కలవరపెట్టింది... "మీ అన్నాయ్‌కి" అన్నాను.

"ఏం మా అన్నాయ్‌కేం? చక్కగా ఆఫీసు నుంచి ఇప్పుడే వచ్చాడు ... బజారుకెళ్ళాడు కొద్దిపనుండి. ఇప్పుడే వస్తూనే వుండాలి..."

నాకు పిచ్చెత్తినట్టయింది. అయితే ఈ టెలిగ్రాము నెవరిచ్చారు నాకు? అర్థంకాక సుజాత ముఖంలోకి చూడడమే శరణ్యమైంది.

"ఏం కొత్తవాడిలా అలా చూస్తావేం?" అంటూ కిలకిలానవ్వింది. "లోపలికొచ్చి ముఖం అదీ కడుక్కునికూర్చో, మాంచి వేడివేడిపూరీలు నాలుగు తెస్తాను. ఇప్పుడే తయారయాయి."

మనస్సులోని మథన భరించలేక "అయితే దీనికర్థం యేవిటో చూడు?" అని జేబులోంచి కాగితంతీసి సుజాతకందించాను పరధ్యానంగా. సుజాత అదుర్దాతో ఆ కాగితాన్ని విప్పింది. చదివింది....ఆవిడబుగ్గలు ఒక్కసారిగా ఎర్రబడిపోయాయి. చిలిపిగా నావైపుచూస్తూ "ఇదెవరికన్నా రాసిన ప్రేమలేఖా? లేక, భగ్నప్రేమికుడి కవిత్వమా? నాకర్థంకావడంలేదు" అంది.

అదిరిపోయి చూశాను...అరే...అది టెలిగ్రాం కాగితంకాదు. రాత్రి గంటన్నరసేపు కూర్చుని వ్రాసిన పొయిట్రీ..."ప్రేమించడం ఆత్మవంచన" అన్న ధోరణిలో వ్రాసేశాను...మరి టెలిగ్రాం ఏమయిందీ?.... ప్చ్...డిసప్పాయింటుమెంట్...

నాకు విచిత్రం, విచిత్రాన్ని మించిన నిరుత్సాహం కలిగింది. టెలిగ్రామ్‌ఫారం తొందర్లో ఇంట్లోనే మరిచిపోయానల్లేవుంది. ప్చ్... వెధవమైండు... నట్లూడిపోయిన యంత్రం.

"అఘోరించావులేగాని ముందు లోపలికినడు. తరవాత మాట్లాడదాం" అంటూ నా బుజమ్మీద చెయ్యేసినెట్టారెవరో. వెంకోబారావు ఓరి వీడి తస్సాదియ్యా. మొద్దులా... దుక్కదున్నలా... వున్నాడు. గాలిగంగలా వూరంతాతిరిగొస్తున్నాడల్లే వుంది. వీడికి పక్షవాతం ఎక్కడుంది?

మనస్సులో కొంతబరువు దిగినా, అసలు సంగతి అర్థంకాక బుర్ర ఖరాబై నా పని కంపలో పడ్డ కాకిలా అయింది. కాదూమరి?

ఏదేమైనా ఆరోజు సుజాతచేతి వేడిపూరీలూ రాయల్ గెస్ట్‌హౌస్‌లో దొరికేలాంటి భోజనం లభించాయి. కాని అనుమానం నివృత్తికాలేదు.

భోజనాలయ్యాక తీరిగ్గా కూర్చున్నాం. సుజాత యిల్లు సర్దుకుంటూంది. వెంకోబరావు గాడు అసలు విషయం బయటవేశాడు. నాకు నాకు ఆశ్చర్యం, రోషం, క్రోధం ఒకేసారివచ్చి వాణ్ణి లాగి తన్నాలంత కసి పుట్టిందంటేనమ్మండి.

సారాంశమేమిటంటే, వాడికి ఈ వూరినుంచి ట్రాన్స్‌ఫర్ అయిందట. పదిహేనో తేదీన అక్కడికెళ్ళి జాయినయితీరాలిట. సరే జాయినౌతాడనుకోండి. అక్కడ సుజాత చదువు మిగిలిన నాలుగు నెలలూ పూర్తి అయ్యే ఏర్పాట్లు లేవు. డిస్కంటిన్యూ చేయించడం వాడికి ససేమిరా యిష్టంలేదట. వాడికిదో పెద్ద సమస్యగా అయింది, మళ్ళా ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకోడానికి ఏమాత్రం అవకాశం లేదట. అదో మలేరియా ప్రాంతట.

"మరీ టెలిగ్రాం సంగతేవిట"న్నాను నాకు విసుగెత్తి.

ఈ పదిరోజుల్లోనే తప్పక రావాలని వుత్తరం రాస్తే జాప్యం, సోమరితనంవల్ల రానని వాడికి బాగా నమ్మకమట. నేను వాణ్ణి నిర్లక్ష్యిస్తాననే భావంతో,సుజాతకి తెలీకుండానే ఆవిడ పేరుతో తనే టెలిగ్రాం యిచ్చాడట. చూడండి వాడివరస ఎలావుందో వళ్లు మండింది నాకు నన్నింతగాభరా పెట్టినందుకు మండదూ?

అంతటితో వూరుకోలేదు వాడు. నల్లగా బయటవేశాడు కబురు.

ఎంతోకాలంనుంచీ సుజాతని నాకిచ్చి పెళ్ళిచేసెయ్యాలని వాడికుందట. సుజాత అభిప్రాయం తెలుసుకుంటే తనకంటే ముందే ఆవిడకా అభిప్రాయంవుందని తెలిసిందట. కాబట్టి దాని చదువు చెడిపోకుండా వుండాలంటే నేను దాన్ని పెళ్ళిచేసుకుని ఇటొచ్చేయాలట. పెళ్ళి ప్రస్తుతం చేసుకోకున్నా తీసుకునివచ్చి ఈ నాలుగు నెల్లూ చదివించాలట. లేదూ, ఇంకోవారంలో క్లుప్తంగా పెళ్ళికూడా జరిగిస్తాడట నేనొప్పుకుంటే. అన్ని విధాలా యీ విషయంలో వాడిని నేను మన్నించి స్నేహానికి విలువను చూపాలట. ఇదీ వాడిధోరణి.

ఇది మళ్ళీ వాడి చెల్లెలి భవిష్యజ్జీవితానికి సంబంధించిన అత్యవసర సమస్య కాబట్టే ఇలా పిలిపించాననీ క్షమించమనీచివరికికూశాడనుకోండి.

నా గుండెల్లో జలపాతం దూకినంత ఆవేదనే కాక, వాణ్ణి నిలువునా బుర్ర బద్దలు చేయాలనిపించింది. ఊరికే వుత్తరం రాయకూడదూ, ఇష్టం వుంటే వచ్చేవాణ్ణి లేకుంటే లేదు నన్ను నానా హైరానల పాలూచేసి, చివరికి నాకు పెళ్ళిచేయడానికా వీడు పిలిపించింది?

మర్నాడింకా సరిగ్గా తెల్లవారకముందే లేచాను. వెంకోబారావుగాడు నిద్రలోంచి లేవనేలేదింకా, సుజాత సందున చెంబూ తప్పేలాలు బయటవేస్తోంది అంట్లు తోమేమనిషికి... నేను పరిశీలించాను ఆవిడనోసారి మనస్సులోనే... 'అమాయకత్వం నిండుకున్న అందాలబాల' .. కాఫీనీళ్ళకి పొయ్యి వెలిగించడానికి యత్నిస్తోంది.

తిన్నగా వాకిట్లోంచి బయటపడ్డాను. నా కాళ్ళు నన్ను స్టేషన్‌కు లాక్కొచ్చి పడేశాయి. బతుకుజీవుడా అంటూ అరున్నరకివచ్చే పార్సెల్ ట్రెయిన్‌కి టికెట్టుకొనుక్కుని పదిగంటలకల్లా కొంపకిచేరుకున్నాను. ఇక వాళ్ళేమన్నా భావించనీండి. నాకేం భయంలేదు.

ఇంట్లో అడుగుబెట్టి తలుపుతీయగానే మళ్ళీ ఏదో వుత్తరం ప్రత్యక్ష్యం. నా బతుకిలా వుత్తరాల్తో వెళ్లమారాల్సిందేననుకుంటూ తీసిచూశాను. మా అన్నాయ్ రాశాడు, ఆరోతేదీ మధ్యాహ్నం వరకల్లా ఇంటికిరావాలనీ, పిల్లనివ్వడానికెవళ్లో వస్తారనీ, ఈమారు డిసప్పాయింట్ చేసేనాటంటే నేను తిరిగి తనని చూసే యోగ్యత వుండదనీ.

ఆలోచిద్దామన్నా మెదడు బండలా మారిపోయింది. మనస్సు ప్రజ్వరిల్లిపోతూంటే కలంపట్టి వుత్తరం రాశాను మావాడికి: వీలుగావుంటే తప్పక వచ్చితీరతాననీ, లేకుంటే ముహూర్తం కూడా పెట్టించవచ్చనీ, పిల్లని నేనిక చూడాల్సిన అవసరంకూడా లేదనీ, ఇది పరిహాసంకాదని అమ్మకి తెలీచేయమనీ వ్రాసేశాను... ★